www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 19 జనవరి 2023

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

ప్రాజెక్టువర్క్‌తో ఆలోచనా శక్తి పెంపు

ప్రజాశక్తి - మామిడికుదురు



విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకతను పెంపొందించటానికి ప్రాజెక్టు వర్కులు దోహద పడతాయని ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మామిడి కుదురుకు చెందిన ఎన్.లితిష్‌వర్ధన్ రాజమండ్రి శ్రీ చైతన్య స్కూల్‌లో సివిల్స్ బ్యాచ్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవుల్లో ఆ పాఠశాల యాజమాన్యం ఇచ్చిన ప్రాజెక్టు వర్క్‌ను ఎంపిడిఒ బుధవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రగతికి విద్యార్థి చేసిన ప్రాజెక్ట్ వర్క్ స్ఫూర్తిదాయకంగా ఉందని ఎంపిడిఒ అభినందించారు.

అరకొరగానే వైద్యం

నాలుగు పిహెచ్‌సిలకు ఒక్కరే వైద్యులు

నిలిచిన వైద్య పరీక్షలు

పట్టించుకోని పాలకులు, అధికారులు...

ప్రజాశక్తి - మండపేట

పట్టణ ప్రజలకు వైద్యం మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యం సదుపాయాలు అందకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వైద్యం కోసం వచ్చే వారు వైద్యసేవలు పొందకుండానే వెనుదిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండపేట పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం చెంతనే ఒకటి, స్థానిక గొల్లపుంత కాలనీలోని టిడ్కో ఇళ్ల సముదాయంలో మరొకటి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. దళిత పేటలోని ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టు, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎల్‌జిఎస్ ఉన్నారు. ఈ ఆసుపత్రికి నెలకు 70 నుంచి 100 మంది బిపి, 80 నుంచి 100 మంది మధుమేహ వ్యాధి గ్రస్తులు వస్తుంటారు. వీరికి హెచ్‌బి, షుగర్, తదితర 8 రకాల పరీక్షలు నిర్వహించి



టెక్నీషియన్ లేక ఖాళీగా దర్శనమిస్తున్న ల్యాబ్

మందులు అందజేయాల్సి ఉంది. మూడు నెలల నుంచి ఈ ఆసుపత్రుల్లో ల్యాబ్ టెక్నిషియన్ లేకపోవడంతో వైద్య పరీక్షలు నిలిచిపోయాయి. దీంతో ప్రయివేట్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నామని ఆసుపత్రికి వచ్చేవారు చెబుతున్నారు. పని చేసే సిబ్బంది కనీసం యూనిఫామ్‌ను సైతం వేసుకోకపోవడంతో వైద్య సాయం కోసం ఎవరిని అడగాలో తెలియడంలేదని పలువురు వాపోతున్నారు. అంతేకాకుండా రెండు నెలల నుంచి రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందట్లేదు. ప్రస్తుతం ఇక్కడి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ స్పందన రామచంద్రపురంలోని రెండు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, మండపేటలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యాధికారిగా ఉన్నారు. ఇక్కడి పనిచేసే సిబ్బంది దూర ప్రాంతాల నుంచి వస్తుండటంతో సమయపాలన కూడా సక్రమంగా ఉండటంలేదని రోగులు చెబుతున్నారు. ఇంటి దగ్గరలోనే ఆసుపత్రి ఉన్న వైద్య సేవలు పోందేందుకు సుమారు కిలో మీటర్ దూరంలో ఉన్న ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుందని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు.



దళితపేటలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం

అంతేకాకుండా ఈ కేంద్రానికి స్వీపర్ కూడా లేకపోవడంతో ఆసుపత్రి ఆవరణం అంతా చెట్ల నుంచి రాలిన ఆకులతో నిండి అస్తవ్యస్తంగా మారింది. టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద ఉన్న ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ఎల్‌జిఎస్ ఉన్నారు. ఇప్పటికైనా వైద్యులను, ల్యాబ్ టెక్నిషియన్‌ను నియమించి వైద్య పరీక్షలతో కూడిన వైద్యం అందించాలని ప్రజలు కోరుచున్నారు.

స్టాఫ్ నర్సులతో హెచ్‌బి, సుగర్ పరీక్షలు

రామచంద్రపురంలో రెండు కేంద్రాలకు రెగ్యులర్ కాగా, మండపేట రెండు కేంద్రాలకు ఇన్‌ఛార్జిగా సేవలు అందిస్తున్నాను. ల్యాబ్ టెక్నీషియన్ లేరు. అయితే హెచ్‌బి, సుగర్ పరీక్షలకు స్టాఫ్‌నర్సులు చేస్తున్నారు. ఈ మేరకు ఇబ్బంది లేకుండా వారికి వైద్యం అందిస్తున్నాం.

- స్పందన, వైద్యాధికారి

టిటి ఇంజక్షన్ లేదన్నారు



వారం రోజుల క్రితం నన్ను ఎలుక కరిచింది. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి టిటి చేయమంటే ఇంజక్షన్ లేదు అన్నారు. సామాన్య ప్రజలకు వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలి.

- పి.మేరి, స్థానికురాలు

వైద్యులను నియమించాలి



వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్‌లు అందుబాటులో లేకపోవడంతో వైద్య సేవలు సరిగా అందడంలేదు. వైద్యులు ఎప్పుడు వస్తారో తెలియక ఆసుపత్రి చుట్టు తిరుగుతున్నాం. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలి. సక్రమంగా వైద్యం అందేలా చూడాలి.

- వై.పాప, స్థానికురాలు

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - అమలాపురం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిఆర్ఒ సత్తిబాబు

గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబు జిల్లా స్థాయి అధికారులు ఆదేశించారు. బుధవారం స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియంలో పోలీస్ పెరేడ్ ఏర్పాట్లు, గ్రౌండ్ చదును, శకటాల ప్రదర్శనకు వీలుగా రోడ్డునిర్మాణం, పొదల తొలగింపు, వంటి ముందస్తు కార్యక్రమాలు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డిఒ వసంతరాయుడు, మున్సిపల్ కమిషనర్ విఐపి.నాయుడు, డిఎస్‌పి పి.విజయసారథి, తహశీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపిడిఒ ప్రసాద్, ట్రాన్స్‌కో ఇఇ రవికుమార్, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఛీఫ్ కోచ్ సురేష్‌కుమార్, డిఇ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

పొన్నాడ జీవితం స్ఫూర్తిదాయకం

మంత్రి వేణుగోపాలకృష్ణ

ప్రజాశక్తి-రాజోలు

సీనియర్ న్యాయవాది, గాంధేయవాది పొన్నాడ హనుమంతరావు జీవితం స్ఫూర్తి దాయకమని బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం రాజోలులోని గాంధీ హౌస్‌లో హనుమంతరావు సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి వేణు హాజరై హనుమంతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ న్యాయవాదిగా, రచయితగా, రాజకీయ నాయకునిగా పొన్నాడ అందించిన సేవలు ఎనలేనివన్నారు. జిల్లా జడ్జి యు.ఇందిరా ప్రియదర్శని మాట్లాడుతూ హనుమంతరావు 60 ఏళ్లపాటు న్యాయవాద వృత్తిలో సేవలందించారన్నారు. అనేక చట్టాలను సామాన్యులకు అర్థమయ్యే రీతిలో తెలుగులో అనువాదం చేశారన్నారు. మాజీ ఎంఎల్ఎ మానేపల్లి అయ్యాజీవేమా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అత్యంత విధేయుడిగా ఉంటూ రాజోలు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన పోటీ చేశారన్నారు. రాజోలు సర్పంచ్‌గా పలు కాలనీల్లో ఇళ్ల స్థలాలను ఉచితంగా అందజేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది వాడ్రేవు పాపయ్య పంతులు, పొన్నాడ సూర్యారావు, పొన్నాడ సూర్యప్రకాశ్, పొన్నాడ ఎస్‌ఆర్‌వివి.సూర్యారావు, పిసిసి సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు, పాముల రాజేశ్వరీదేవి, రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి, దార్ల పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - అమలాపురం

రహదారి నిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని కలెక్టర్ హిమాన్షుశుక్లా అన్నారు. కలెక్టరేట్ వద్ద బుధవారం భద్రత వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 34వ రహదారి భద్రత వారోత్సవాలను ఈ నెల 18 నుంచి 24వరకూ నిర్వహించాలని ఆదేశించిందన్నారు. ఈ మేరకు అవగాహనా కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ఓవర్ స్పీడ్‌తో వాహనం నడపడం వంటి చర్యలకు పాల్పడరాదన్నారు. రహదారి భద్రతా నియమాలు అందరూ సక్రమంగా పాటించాలన్నారు. కార్లలో ప్రయాణించే వారు ప్రమాద తీవ్రతను తగ్గించుకునేందుకు సీట్ బెల్ట్‌ను వాడాలని అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలన్నారు. రోడ్డు ట్రాఫిక్ భద్రత అనేది ప్రమాదాల నివారణకేనన్నారు. రహదారి భద్రతా నియమాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాపరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, రవికుమార్, నాగేశ్వరరావు, కాశీ విశ్వేశ్వరరావు, నాగేంద్ర, డిఎస్‌పి మధుసూదన్‌రావు, ఆర్‌టిసి డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి, ఎస్ఇ బి.రాము తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



సుమలతను అభినందిస్తున్న రామకృష్ణ

డివిజన్ వైద్యాధికారి సుమలతకు అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్ల పిహెచ్‌సిలో ప్రధాన వైద్యాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం.సుమలత ఇటీవల కొత్తపేట డివిజన్ వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా నియమితులయ్యారు. డివిజన్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత బుధవారం ఆమె చొప్పెల్ల పిహచ్‌సికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెను పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ ఆకుల రామకృష్ణ బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజలకు అన్నివేళలా అందుబాటులో సుమలత వైద్యసేవలందించారన్నారు. కోవిడ్ నియంత్రణలో ప్రత్యేక శ్రద్ధ వహించేవారన్నారు. నూరు శాతం వ్యాక్సినేషన్ అందించిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. ఈ మేరకు డివిజనల్ వైద్యాధికారిగా ఆమెకు ఉద్యోగోన్నతి లభించడం ఆనందదాయకమన్నారు. వైద్యాధికారి సుమలత మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఏడు మండలాలు ఉన్నాయన్నారు. రోజుకో మండలం చొప్పున సందర్శించి మెరుగైన వైద్యసేవలు అందేలా చూస్తానన్నారు.

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం

టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా పలువురు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేశారు. పలుచోట్ల అన్న, వస్త్రదానాలు చేపట్టారు. **అయినవిల్లి** మండలం శానిపల్లిలంకలో టిడిపి గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు కడలి శంకరం, పి.కృష్ణ అధ్యక్షతన ఎన్‌టిఆర్ వర్ధంతిని నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు చిట్టూరి శ్రీనివాస్, కుడుపూడి బుజ్జి ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనతంరం విలస న్యూ లైఫ్ సెంటర్‌లో రోగులకు పండ్లు, రొట్టెలు పంచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెచ్‌ఆర్‌డిమెంబర్ నేదునూరి వీర్రాజు, అధికార ప్రతినిధి బొబ్బా ప్రభాత్ కుమార్, సమన్వయ కమిటీ సభ్యులు మోత వెంకటేశ్వరావు, తెలుగురైతు వర్రే శ్రీను, ,తెలుగు యువత అధ్యక్షులు మేడిశెట్టి అంజిబాబు పాల్గొన్నారు. **ముమ్మిడివరం** పోలమ్మ చెరువు వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి ముమ్మిడివరం ఇన్‌ఛార్జి దాట్ల బుచ్చిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చెల్లి అశోక్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **రాజోలులో** గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ అల్లూరు వెంకటసూర్యనారాయణరాజు పాల్గొని మాట్లాడారు. వైసిపిని గద్దె దించినప్పుడే ఎన్‌టిఆర్‌కు నిజమైన నివాళి అన్నారు. రాజోలు మార్కెట్ సెంటర్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి బి.వెంకటరమణ, ఎంపిపి కేతా శ్రీనివాస్, బి.శ్రీనివాస్, కె.త్రినాథ్‌స్వామి టిడిపి నాయకులు పాల్గొన్నారు. **ఆలమూరు** పెదపళ్ల ఆంజనేయస్వామి గుడి వద్ద ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల ఎన్‌టిఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకి టిడిపి శ్రేణులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సలాది నాగేశ్వరరావు, జి.నాగేశ్వరరావు, పిల్లి వెంకటేశ్వర్లు, సయ్యద్ అషామ్ వలీ, కోట వెంకన్న, కోట శ్రీను, వై.రామ్‌ప్రసాద్, నామాల వెంకటేష్, యార్లగడ్డ రవి పాల్గొన్నారు. **మండపేట** వాణి మహల్ జంక్షన్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడిన నందమూరి అందరికీ స్ఫూర్తినీయుడన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, టి.వేణుగోపాల్, ఎం.నాగు తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట** బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి అనంతకుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. పేదలకు, సత్యసాయి సేవా సమితిలో వృద్ధులకు అన్నదానం చేశారు. పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు.



అంబాజీపేటలో పేదలకు దుప్పట్లు అందిస్తున్న టిడిపి నాయకులు



ఆలమూరు మండలం పెదపళ్లలో...



ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి సెంటర్‌లో ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు, అంబాజీపేటల్లోని ఎన్‌టిఆర్ విగ్రహాలకు టిడిపి అమలాపురం పార్లమెంటు అధికార ప్రతినిధి డివివి.సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ యువసేన అధ్యక్షులు వక్కలంక బుల్లియ్య సమకూర్చిన దుప్పట్లను పేదలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దొమ్మేటి శ్యామ్, బి.పెదబాబు, ఎ.బలరామ్మూర్తి, రవణం రాము, చిన్నం విజయారావు, ఎన్.వి.సుబ్బారావు, మందా రాజేష్, టిడిపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు. **కాట్రేనికోన** చెయ్యేరు అగ్రహారంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులకు, రోగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఎన్.నాగేశ్వరరావు, ఎన్.సుబ్బరాజు. చెల్లి సురేష్, ఎస్.బాబూరావు, జి.సూర్యమహాలక్ష్మి, జె.రాజారావు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** బాలయోగి పార్కు, గొల్లవిల్లి సెంటర్లలో ఎన్‌టిఆర్ విగ్రహాలకు మాజీ ఎంపీ ఎజెవి బుచ్చి మహేశ్వరరావు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ నల్లా బాపండి, జడ్‌పిటిసి మాజీ సభ్యుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు జి.చిన్న, తెలుగు రైతు మండల అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** మండలం అంగరలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి అమలాపురం పార్లమెంటరీ అధికార ప్రతినిధి పి.శ్రీనివాస్, నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కపిలేశ్వరపురంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎఎంసి మాజీ చైర్మన్ పువ్వల చిట్టిబాబు ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. **రామచంద్రపురంలో** ఎన్‌టిఆర్ విగ్రహానికి రెడ్డి సుబ్రహ్మణ్యం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్న క్యాంటీన్ ప్రాంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కడియాల రాఘవన్, జి.సూర్యనారాయణమూర్తి, కె.వీర్రాజు, ఎం.రవికుమార్, చప్పిడి వెంకటేశ్వరరావు, సలాది రమేష్, ఎస్.సాయిబాబు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు కె.గంగవరం మండలం పాణింగ పల్లి, కె.గంగవరం బస్టాండ్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్టూ'నిజం'



వారి స్నేహం ఆపాతమధురం

ప్రజాశక్తి - కాట్రేనికోన

కాట్రేనికోన జడ్‌పి ఉన్నత పాఠశాలలో 1994-95 పదోతరగతి విద్యార్థులు బుధవారం అదే పాఠశాలలో ఆత్మీయ కలయిక నిర్వహించారు. 28 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆనాటి గురువులను ఘనంగా సత్కరించారు. అప్పటి ఉపాధ్యాయులు రాజు, వెంకటరెడ్డి, ముసలయ్య, శ్రీరాములు ఆనందరావు, శేషావేణి, రామకృష్ణలను సన్మానించి జ్ఞాపికలను అందించారు. పూర్వ విద్యార్థులు నేలపాటి బాలకృష్ణ, జనుపల్లి విజయదుర్గ, శ్రీనివాస్, సుధాకర్, వెంకటరమణ, వీరబాబు, ధర్మారావు, సహదేవుడు, సాగర్, శంకర్, రత్నకుమారి, రాంబాబు వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

మండపేట : స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 1984 - 85 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం కాపు కళ్యాణ మండపంలో జరిగింది. మండపేటలో ఉంటున్న కొంత మంది మిత్రులు ఒక కమిటీగా ఏర్పడి వాట్సాప్ గ్రూప్ ద్వారా విద్యార్థులను ఏకం చేసి సమ్మేళనాన్ని నిర్వహించారు. అప్పటి గురువులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి సత్కరించారు. గురువులకు నూతన వస్త్రాలు సమర్పించి, జ్ఞాపికలను అందించారు.



మండపేటలో...



అల్లవరంలో...

అల్లవరం : అల్లవరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల 1997-98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బసవ వరహాలు, మాజీ హెచ్‌ఎం కూచిమంచి వెంకటరాజు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ హెచ్‌ఎం వెంకటరాజు మాట్లాడుతూ పదో తరగతి చదివి 25 ఏళ్ల పూర్తియిన సందర్భంగా నాటి ఉపాధ్యాయులందర్నీ గుర్తుంచుకుని ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. పూర్వవ విద్యార్థులతో పాటు సహ ఉపాధ్యాయులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ వరహాలు ఆనాటి నుంచి నేటి వరకు పాఠశాల అభివృద్ధి కోసం అహర్నిశలూ కృషి చేస్తూనే ఉన్నారన్నారు. ఆయన సేవనలు మరువలేనివన్నారు. డాక్టర్ వరహాలు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన ఎందరో విద్యార్థులు నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. ఆత్మీయ కలయిక ద్వారా నాటి ఉపాధ్యాయులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. అల్లవరంలో ఉన్నత పాఠశాల ఏర్పాటు కృషి చేసిన పెద్దలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు, సిబ్బందిని పూర్వవిద్యార్థులు సత్కరించి, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత హెచ్‌ఎం నయనాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



కాట్రేనికోనలో...



పౌష్టికాహారక కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

క్షయ బాధితులకు సాయం అందించాలి

ప్రజాశక్తి - అమలాపురం

క్షయ బాధితులకు స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు మానవతా దక్పథంతో ముందుకొచ్చి సాయం అందించాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో 15 మంది క్షయ బాధితులకు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులైన ఒంటెద్దు వెంకయ్యానాయుడు, జల్లి సుజాత, నెల్లి సావిత్రి మేఘన సమకూర్చిన పౌష్టికాహార కిట్లను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పిఎస్.శర్మ సమకూర్చిన స్వీట్ బాక్స్‌లు కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో పేదరికంతో, అనారోగ్యంతో జీవిస్తున్న వారి పట్ల మానవతా దక్పథంతో ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి సాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబు, డిఎంహెచ్ఒ ఎం.దుర్గారావుదొర, అదనపు డిఎంహెచ్ఒ సిహెచ్‌వి.భరత లక్ష్మి, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

20న మడ అడవుల సంరక్షణపై సదస్సు

- మీడియా పాత్రపై కోరంగి వేదికగా ప్రత్యేక చర్చ

- ఎపి ప్రెస్ అకాడమీ కార్యదర్శి బాలగంగాధర తిలక్

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో మడ అడవుల సంరక్షణ, సామాజిక బాధ్యత-మీడియా పాత్రతో పాటు జర్నలిజం మౌలిక సూత్రాలు, విలువలు అంశాలపై ఈ నెల 20న తాళ్ళరేవు మండలం, కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో ప్రత్యేక చర్చ జరగనుందని ప్రెస్ అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాల గంగాధర తిలక్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కాకినాడ జిల్లా, అటవీ శాఖ సంయుక్త నిర్వహణలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ముమ్మిడివరం ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ అధ్యక్షతన జరగనుందన్నారు. కార్యక్రమానికి ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, కాకినాడ రూరల్, అర్బన్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఎస్‌పి ఎం.రవీంద్ర నాథ్‌బాబు, జిల్లా అటవీశాఖ అధికారి ఐ.కె.వి.రాజు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. సముద్ర ప్రాణికోటి మనుగడకు మూలాధారమైన ప్రకృతి సంపద పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జర్నలిస్టులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాలగంగాధర్ తిలక్ కోరారు.

19, 20 తేదీల్లో రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని పర్యటన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈ నెల 19, 20 తేదీల్లో కాకినాడ జిల్లాలో పర్యటిస్తారు. ఆయన 19వ తేదీ రాత్రి 8 గంటలకు కాకినాడ చేరుకుని ఆర్ అండ్‌బి అతిథిగృహంలో బస చేస్తారు. 20వ తేదీ ఉదయం 9.30గంటలకు చొల్లంగి టూరిస్ట్ స్పాట్ ఫెర్రీ పాయింట్ నుండి సందర్శిస్తారు. అనంతరం కోరంగి అటవీ శాఖ సమావేశ మందిరంలో మడ అడవుల సంరక్షణపై నిర్వహించే అవగాహన సదస్సుకు హాజరవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడ ఆర్అండ్‌బి అతిథిగృహానికి చేరుకుని, 4 గంటలకు విజయవాడ బయలుదేరి వెళతారు.

గణపతి శాస్త్రి ఇంట్లో చోరీకి యత్నం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక కంచి సంస్థానం చైర్మన్, కీ.శే. బ్రహ్మశ్రీ చంద్రభట్ల చింతామణి గణపతి శాస్త్రి ఇంట్లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి ప్రయత్నించారు. అయితే రాత్రి ఇంటిలో కుటుంబీకుల అలికిడి వినిపించి పరారయ్యారు. స్థానిక కంచి సంస్థానంగా పిలవబడే గణపతి శాస్త్రి గృహంలో దొడ్డి స్థలం వైపున్న గేటుకు గల తాళాలను పగులు కొట్టి గుర్తుతెలియని దుండగులు లోపలికి ప్రవేశించి ఇంటిలోనికి వెళ్లేందుకు మరొక గుమ్మానికి గల తాళాలను ఇనుప రాడ్ల సహాయంతో బద్దలు కొట్టి ఇంటిలోనికి ప్రవేశించేం దుకు ప్రయత్నించారు. ఆ సమయంలో కుటుంబీకులు అలికిడికి ఆ దుండ గులు పరారైనట్లు గణపశాస్త్రి సోదరుడు పతంజలి శాస్త్రి పోలీసులకు వివరించారు. వారు ఇంటిలోకి ప్రవేశించలేదని ఎక్కడి సామగ్రి అక్కడే భద్రంగా ఉందని పతంజలి శాస్త్రి పోలీసులకు వివరించారు. ఆయన ఫిర్యాదు మేరకు స్థానిక సిఐ కె.దుర్గాప్రసాద్, క్రైమ్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాకినాడ నుంచి క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలను సేకరించి, దర్యాప్తును వేగవంతం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ దుర్గ ప్రసాద్ తెలిపారు.

గండేపల్లి మండలంలో రెండు చోట్ల చోరీ

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలంలో గండేపల్లి మల్లేపల్లి గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి రెండు చోట్ల చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. గండేపల్లి గ్రామస్థుడైన మామిడిపల్లి కళ్యాణ్ శ్రీనివాస్ అను అతను తన కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలం వెళ్లగా అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు అతని ఇంటిలోకి ప్రవేశించి, బీరువా తాళాలు పగులగొట్టి వారు బీరువాలో దాచుకున్న సుమారు ఐదున్నర కేజీల వెండి వస్తువులను, నాలుగు గ్రాముల బంగారు వస్తువులు, రూ.30 వేలు దోచుకు పోయారు. మల్లేపల్లి గ్రామంలో అడబాల శ్రీనివాస్ ఇంట్లో జరిగిన దొంగతనంలో రూ.10 వేలు, అరకాసు బంగారం చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు గండేపల్లి ఎస్ఐ శ్రీ వై గణేష్ కుమార్ కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాల్లో క్లూస్ టీం తో ఎస్ఐ గణేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - గండేపల్లి

రంగంపేట మండలం రంగంపేట గ్రామానికి చెందిన సుక్కిరెడ్డి సాయి సుధాకర్ (50) కుటుంబ సమస్యల వలన ఈనెల 17న రాత్రి 8:30 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో పలు చోట్ల వెతికిన సుధాకర్ కనపడలేదు. దీంతో అక్కిరెడ్డి మార్యాదేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంపేట ఎస్ఐ టి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మహారాణి కళాశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి -పెద్దాపురం

పెద్దాపురం మహారాణి కళాశాలలో, శ్రీ వీర్రాజు హై స్కూల్ లో చదువుకుని వివిధ ప్రాంతాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సంక్రాంతికి సొంత ఊరు వచ్చిన సందర్భంలో బుధవారం తాము చదివిన కళాశాలలో, హైస్కూల్ లో కలుసుకుని, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా మహారాణి కళాశాలలో 2005-08 సంవత్సరంలో డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థుల దుర్గా, వెంకటేష్, జిలాని, సత్యనారాయణ, ఖాన్, మహాపాత్ర దేవి తదితరుల ఆధ్వర్యంలో అధ్యాపకులు ఏసుబాబు, గాయత్రి, బి.వెంకటేశ్వరరావులను సన్మానించారు. అలాగే స్థానిక శ్రీ వీర్రాజు స్కూల్లో 1994-95 బెస్ట్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు అప్పటి తమ ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం, స్టీవెన్సన్, ప్రభావతి, రైటర్ సత్యనారాయణ లను ఘనంగా సన్మానించారు.

114.82 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం వేలం

ప్రజాశక్తి-కరప

కరప మండలం వేళంగిలోని మండల స్థాయి గోడౌన్‌లో ఉన్న ద్వారా తరలించి ఉంచిన పిడిఎస్ బియ్యం వేలం వేయనున్నట్లు తహశీల్దార్ పి.శ్రీనివాసరావు బుధవారం ఒక పత్రిక ప్రకటనలో తెలియజేశారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు 114.82 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు నిబంధనలను అనుసరించి బియ్యం తనిఖీ చేసుకుని, వారు ఖరీదు చేయు రేటును సీల్డ్ కవర్లో టెండరు రూపంలో ఈ నెల 20వ తేదీలోపు కరప డిప్యూటీ తహశీల్దార్, సివిల్ సప్లైయిస్, వేలం జరుగుబోయే గోడౌన్‌లో అందజేయవలసిందిగా కోరారు.



ట్రోఫీని అందిస్తున్న ఎంపిపి భవాని తదితరులు

క్రికెట్ టోర్నీ విజేతకు ట్రోఫీ అందజేత

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని మాలపాడులో జరిగిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత జై భీమ్ జట్టుకు ఎంపిపి అంబటి భవాని చేతుల మీదుగా ట్రోఫీని బుధవారం అందించారు. సర్పంచ్ నేమల సుజనసంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీలో 24 జట్లు తలపడ్డాయి. ఫైనల్లో వైఎస్‌ఆర్ నగర్‌కు చెందిన జై భీమ్ జట్టు, ఊలపల్లి జట్టు తలపడ్డాయి. జైభీమ్ జట్టు విజేతగా, ఊలపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచింది. జై భీమ్ టీం కెప్టెన్ దుర్గాప్రసాద్ ట్రోఫీని అందుకున్నారు. విజేతలకు ఎంపిపి భవాని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్లూరి నరేష్, చోదవరం ఎంపిటిసి సాదె సుబ్రహ్మణ్యం, సర్పంచ్ నామల సుజన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై రగడ

- జడ్‌పి సర్వసభ్య సమావేశంలో సభ్యులు నిలదీత

- బడ్జెట్ అంచనాలకు ఏకగ్రీవంగా ఆమోదం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాల్లో జెడ్పిటిసిలకు కనీస మర్యాద లేకుండా అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదంటూ పలువురు జడ్‌పిటిసిలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం కాకినాడలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాలు, సర్వ సభ్య సమావేశాలు జడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి కమిటీ సమావేశాలు, మనబడి-నాడు నేడు పనులు, నవ రత్నాలు-పేదలందరికీ ఇళ్లు, రహదారుల ఆధునీకరణ తదితర అంశాలపై సభ్యులు అధికారులను నిలదీశారు. ముఖ్యంగా ప్రోటోకాల్ విషయంపై జడ్‌పి ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ పట్టుబట్టారు. దీంతో సమావేశం కొంతసేపు రసాభాసగా మారింది. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ, విద్యా కమిటీల సమావేశాలకు తమను అధికారులు పిలవడం లేదని ముమ్మిడివరం, ఉప్పలగుప్తం జెడ్పిటిసి కుడిపూడి శివశంకర్రావు, గెడ్డం సంపదరావులు ఆవేదన వ్యక్తం చేయగా మిగిలిన సభ్యులు కూడా వారికి మద్దతుగా నిలిచారు. క్రింద స్థాయి అధికారులు తమను పట్టించుకోవడం లేదంటూ చైర్మన్, అధికారులను నిలదీశారు. దీనిపై ఎంపి వంగా గీత మాట్లాడుతూ ప్రోటోకాల్ విషయంపై క్రింది స్థాయి అధికారులు జడ్‌పిటిసీలకు గౌరవం ఇవ్వాలన్నారు. పలు విద్యా రంగ సమస్యలను సభ్యులు ఏకరువు పెట్టారు. ఎంఎల్‌సి చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ యాప్‌లతో కుస్తీలు పడుతుండడం వలన ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు సకాలంలో అందడం లేదన్నారు. ఆర్‌అండ్‌బి రహదారులకు గోతుల వలన ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను జడ్‌పి వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. పిఠాపురం నుంచి సామర్లకోట వెళ్లే రహదారి మరింత అధ్వానంగా మారిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించాల్సిన అవసరం ఉందని చిక్కాల తెలుగుదేశం సమావేశానికి వెళ్తూ క్రమంలో మీరే దండ పట్టుకుని రావొచ్చు కదా అని చైర్మన్ వేణుగోపాలరావు ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రికి ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ చిక్కాల ఈ సందర్భంగా అసహనం వ్యక్తం చేశారు.

రూ.1,379 కోట్ల అంచనాలతో బడ్జెట్‌కు ఆమోదం

సాధారణ నిధులు, వివిధ గ్రాంట్‌తో పాటు వివిధ విభాగాలకు విడుదలయ్యే నిధులను కూడా కలిపి 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.70 లక్షల మిగులుతో రూ.1,379 కోట్ల అంచనాలతో రూపొందించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ బడ్జెట్ అంచనాలను జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో తొలుత యు.కొత్తపల్లి ఎంపిడిఒ నంబూరి ప్రభాకర రామారావు మృతిపై నివాళులు అర్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్ వేణుగోపాలరావు

అనంతరం పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడేలా జగనన్న విద్యా భారతి పేరుతో జిల్లా ప్రజాపరిషత్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం జడ్‌పి సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ బడ్జెట్ సవరణలను, 2023-24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలను పద్దుల వారీగా సభ్యులకు వివరించారు. అన్ని పద్దులు కలుపుకొని ఆదాయాన్ని రూ. 1,379 కోట్లుగా, వ్యయాన్ని రూ. 1,378.30 కోట్లుగా అంచనా వేసి బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు. గత 2022-23 ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్ కింద ఆదాయం రూ.1,229.43 కోట్లు కాగా వ్యయం రూ.1,228.78 కోట్లుగా వివరించారు. వైద్యం, ఆరోగ్యం, రహదారులు, భవనాలు, ఇరిగేషన్, గహ నిర్మాణం, విద్య తదితర శాఖల పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న కార్యకలాపాలు, వివిధ పథకాలు, కార్యక్రమాల అమల్లో ప్రగతిపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో కాకినాడ, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు కృతికా శుక్లా, హిమాన్షు శుక్లా, తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, రాజోలు, పిఠాపురం ఎంఎల్‌ఎలు రాపాక వరప్రసాదరావు, పెండెం దొరబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేరాలు-ఘోరాలు

రోడ్డు పమాదంలో బాలుడు మృతి

-ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం శివారు కొత్తపేటలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక బాలుడు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్రంగా గాయాలు అయినట్లు అన్నవరం పోలీసులు తెలిపారు. రౌతులపూడి మండలం ధార జగన్నాధపురం గ్రామానికి చెందిన బర్ల రమణ, భార్య దుర్గ అతని ఇద్దరు మగ పిల్లలు దుర్గాప్రసాద్, గంగరాజులతో కలిసి పత్తిపాడు మండలం పెద్దిపాలెంలోని తన అత్తగారి ఇంటికి వెళ్లారు. తిరిగి బుధవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో మోటార్ సైకిల్‌పై దారా జగన్నాధపురం వెళుతుండగా అన్నవరం శివారు కొత్తపేట లోని స్నేహా రెసిడెన్సీ వద్దకు వచ్చేసరికి విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్తున్నటువంటి ఆర్‌టిసి బస్సు వెనకనుంచి ఢీకొనడంతో బర్ల రమణ, అతని భార్య దుర్గ రెండో కుమారుడు గంగరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. బర్ల రమణ పెద్ద కుమారుడు దుర్గాప్రసాద్ (6) అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన వారిని వెంటనే తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



రామారావు కుటుంబానికి ధైర్యం చెబుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, జడ్‌పి చైర్మన్ వేణుగోపాలరావు

ఎంపిడిఒ రామారావు మృతి విచారకరం

ప్రజాశక్తి - కాకినాడ

యు.కొత్తపల్లి మండల ఇన్చార్జ్ ఎంపిడిఒగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్‌వీఎస్ రామారావు మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఎంపిడిఒ రామారావు ఈ నెల 16న గుండె పోటు కారణంగా మతి చెందగా బుధవారం మధ్యాహ్నం జడ్‌పి చైర్మన్, కలెక్టర్, జడ్‌పి సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ కాకినాడ గ్రామీణ మండలం, చీడిగలోని రామారావు నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రామారావు భార్యా పిల్లలతో మాట్లాడి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు ఎంపీడీవో రామారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారితోపాటు కాకినాడ డిఎల్‌డిఒ పి.నారాయణమూర్తి, జడ్‌పి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా అభివృద్ధి, సంక్షేమం

- దిశ సమావేశంలో ఎంపి గీత

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల సమన్వయంతో జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివద్ధి పథకాల ప్రయోజనాలు లక్ష్యిత వర్గాల ప్రజలకు సమగ్రంగా చేరేలా కషి చేయాలని ఎంపీ వంగా గీత అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. బుధవారం సాయంత్రం జడ్పి సమావేశ హాలులో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఎంపీ అధ్యక్షతన జరిగింది. జాతీయ ఆరోగ్య మిషన్, ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్‌మెంట్, జల జీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్, మధ్యాహ్న భోజన పథకం, స్మార్ట్ సిటీ మిషన్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, జాతీయ ఆహార భద్రత పథకాల అమలు తీరును కమిటీ సమీక్షించి, అధికారులకు సూచనలు ఆదేశాలు జారీ చేసింది.

తొలుత చేపట్టిన జలజీవన్ మిషన్ పథకం సమీక్షలో జిల్లాలోని 385 ఆవాసాల్లో ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేసే లక్ష్యాన్ని 2024 నాటికి సకాలంలో పూర్తి చేసేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని సభ్యులు అధికారులను కోరారు. ముఖ్యంగా గ్రామ శివారులలో ఉండే బడుగు వర్గాల కాలనీలకు తాగునీరు పూర్తి స్థాయిలో సక్రమంగా అందేందుకు ప్రత్యేక పైపులైన్లు, వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని ఎంపీ అధికారులకు సూచించారు. వచ్చే వేసవిలో ఏ ఆవాసంలో తాగునీటి సమస్య ఎదురుకాకుండా మందస్తు సమ్మర్ యాక్షన్ ప్లాన్ సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులకు సూచించారు. జాతీయ ఆరోగ్య మిషన్‌పై చర్చలో నిర్మాణం పూర్తయిన ఆసుపత్రి భవనాలకు అవసరమైన ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కల్పించి ప్రారభించి ప్రజలకు ఆరోగ్య సేవలు విస్తరించాలన్నారు. ఆసుపత్రులలో



దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి గీత

ఇంకా మిగిలి పోయిన సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేయా లని, క్రమం తప్పకుండా ఆసుపత్రి అడ్వజరీ కమిటీ సమావేశాలు నిర్వహిం చాలని పలువురు ఎంపిపిలు, మున్సిపల్ కమిషనర్లు కోరారు. వైద్య సిబ్బంది పోస్టుల భర్తీకి ప్రభుత్వ ఆమోదం కొరకు ప్రతిపాదించామని, పూర్తయిన ఆసుపత్రి భవనాలను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కలెక్టర్ సభ్యులకు తెలిపారు. మెట్ట మండలాల్లో తరచు కాలిపోతున్న వ్యవసాయ విద్యుత్ సరఫరా ట్రాన్స్‌ఫార్మర్లను జాప్యం లేకుండా పునరుద్ధరించాలని, ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న పవర్ లైన్లను, చేతికి అందేలా ఉన్న ఫ్యూజ్ బాక్స్‌లను చక్కదిద్దాలని ఎంపిపిలు కోరారు. స్మార్ట్ సిటీ ప్రోజెక్ట్ క్రింద చేపట్టిన పనులకు పెండింగ్ చెల్లింపులు సత్వరం జరిపి ఆయా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఎల్‌సి చిక్కల రామ చంద్రరావు కోరారు. సమావేశంలో జడ్‌పి చైర్మన్ వేణుగోపాలరావు,సిఈఓ ఎన్.వి.వి.సత్యన్నారాయణ, డ్వామా పీడీ ఎ.వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జగన్ అన్న ఇంటి నిర్మాణానికి ముఖ్యమంత్రి ఇస్తున్న రూ.లక్షా 80 వేలు ఏమాత్రం సరిపోవడం లేదని రూ.5 లక్షలు ఇచ్చి చరిత్రలో నిలిచి పోవాలని లేకుంటే ప్రజలు గుణపాఠం చెపుతారని సిపిఐ జిల్లాకార్యదర్శి తాటిపాక మధు హెచ్చరించారు. బుధవారం సిపిఐ నగర కమిటీ బృందం వెలుగుబందలో జగన్ అన్న కాలనీని పరిశీలించింది అక్కడ లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు విన్నారు. వాళ్ల నుంచి సంతకాలు సేకరించారు. జగనన్న కాలనీ లబ్ధిదారులు ఇళ్ల స్థలం వచ్చినందుకు ఆనందంగా ఉన్నారని కానీ ప్రభుత్వం ఇచ్చే సహాయం ఏ మాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు కట్టుకోవడానికి ఎంత కాదనుకున్నా రూ.3 లక్షల అవుతుందని అదే కొద్దిగా చుట్టూ గోడల ఇల్లు నిర్మాణం చేయాలంటే రూ.ఆరు లక్షలు అవుతుందని చాలామంది మహిళలు చెప్పారు. దీంతో ప్రతి ఇంటి నిర్మాణానికీ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని మధు డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెపుతారని ఆయన హెచ్చరించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కొండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు మాట్లాడుతూ సిపిఐ పోరుబాట నేటి నుంచి 30వ తేదీ వరకు కొనసాగుతుందని 30న లబ్ధిదారులతో రౌండ్ టేబుల్ సమావేశాలు జరుపుతామని, ఫిబ్రవరి 6న కలెక్టరేట్ వద్ద ధర్నాలు, 22న విజయవాడలో మహాధర్నా చేపడుతున్నామని తెలిపారు. ఈ పర్యటనలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి సప్పా రమణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జ్యోతి రాజు, చింతలపూడి సునీల్, యడ్ల లక్ష్మి, నల్లా రామారావు పాల్గొన్నారు.

పలువురికి ఎంఎల్‌ఎ రాజా పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబాలను ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా బుధవారం పరామర్శించారు. వైసిపి నేత అయ్యల మాధవరావు తల్లి అయ్యల సత్యవేణి సంవత్సరికంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉప సర్పంచ్ మండపాక గణేశ్వర రావు నాన్నమ్మ మండపాక రాజమణి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను, రఘుదేవపురంలో కర్రి ఉమామహేశ్వరరావు తల్లి పుల్లమ్మ, యర్రా వెంకటేష్ తండ్రి యర్రా అంజి కుటుంబ సభ్యులను, ఇనగంటి వారి పేటలో కుంచె అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న మెండు వీరబాబు, సుంకర నరసింహారావు తమ్ముడు వీరన్న, కూన రామకష్ణను పరామర్శించారు.

వెంకటకృష్ణకు పలివెల అభినందన

ప్రజాశక్తి - సీతానగరం

వైసిపి రాజానగరం నియోజవర్గం బూత్ కమిటీల అధ్యక్షునిగా ఎన్నికైన గద్దె వెంకటకష్ణ చౌదరికి బుధవారం సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వీరబాబు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ వంతు కృషి చేస్తు నియోజకవర్గంలో ప్రజలందరిని కలుపుకోవాలని సూచించారు.

ఎస్ఐ శివప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఆలమూరు



ఎస్ఐను అభినందిస్తున్న రాంబాబు

మండలంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతిభద్రతలను పరిరక్షించి ప్రజలంతా ఆనందంగా పండుగ జరుపుకోవడానికి కృషి చేసిన ఎస్ఐ సోమన శివప్రసాద్ గుమ్మిలేరు సర్పంచి గుణ్ణం రాంబాబు బుధవారం సత్కరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎస్ఐ చేసిన కృషి అభినందనీయమన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలోని చినకొత్తలంకలోని 15 మంది నిరుపేద కుటుంబాలకు క్షత్రియ నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూరగాయలు, నిత్యావసర సరుకులు, కోడిగుడ్లు, స్వీట్లను బుధవారం పంచారు. క్షత్రియ నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో తణుకు వాస్తవ్యులు కనుమూరి వెంకటకృష్ణంరాజు జ్ఞాపకార్థం ఆయన మనువడు దీపక్ వర్మ సహకారంతో వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన నిధికి రూ.55వేల విరాళం

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లి విఘ్నేశ్వరస్వామికి మండలంలో వీరవిల్లిపాలేనికి చెందిన రేషన్ డీలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అడపా వెంకటరమణ కుటుంబం అన్నదాన నిధికి రూ.55,074 విరాళంగా అందించింది. వారి కుటుంబం అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ఇఒ సతీష్‌రాజు ఆధ్వర్యంలో శేషవస్త్రములతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఘనంగా గోగులమ్మ జాతర

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో నెలకొని ఉన్న గ్రామ దేవత గోగులమ్మ జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. 13 ఏళ్ల అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఈ జాతరలో గోగులమ్మను గ్రామ వీధులలో మంగళవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మేళ తాళాలతో, బుట్ట బొమ్మలు, బేతాళ నృత్యాలతో ఊరేగించారు. సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు స్వగృహంలో నిర్వహించిన భోజనాల్లో మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు పాల్గొని, అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. నిడదవోలు నియోజకవర్గ టిడిపి నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ గ్రామంలోని పలువురి ఇళ్ళలో జాతర మహోత్సవంలో పాల్గొన్నారు.